కేంద్రకమిటి ప్రకటన

# విజయవంతంగా జరిగిన సిపిఐ(ఎం-ఎల్) అఖిలభారత మహాసభ

**పార్టీ** అఖిలభారత మహాసభ విజయవంతంగా జరిగిందని మన పార్టీ-సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటీ ప్రకటించింది.

2009లో జరిగిన గత మహాసభ ఆమోదించిన మన పార్టీ మౌలిక డాక్యుమెంట్లపై ఆధారపడి పార్టీ బహుముఖమైన కార్యక్రమాలను కొనసాగించింది. ఈ డాక్యుమెంట్ల ఆధారంగా గత 7 సంవత్సరాల కాలాన్ని సమీక్షించుకొనేందుకు, ఈ కాలంలో సాధించిన ఐక్యతను ముందుకు కొనసాగించేందుకు పార్టీ మహాసభ తోడ్పడుతుందని సిసి అభిప్రాయపడింది.

ఈ కాలంలోనే మన ప్రియతమ నాయకుడు మరియు నాటి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కానూసన్యాల్‌ను కోల్పోయాము. కేంద్రకమిటీలో సీనియర్ కామ్రేడ్స్ అయిన కామ్రేడ్స్ అసిత్‌సిన్హా, మాస్టార్జీ, సురేంద్రసింగ్ ఖతియార్, ఉమాశంకర్‌సింగ్, షబ్బర్‌హుస్సేన్ వంటివారిని కూడా కోల్పోయాము. దివంగత నాయకుల స్ఫూర్తిదాయకమైన, సజీవమైన స్మృతులతో పార్టీని, పార్టీ నాయకత్వాన్ని సంఘటితపర్చి, బలోపేతం చేసే ఉద్దేశంతో కేంద్రకమిటి ఈ అఖిలభారత మహాసభను నిర్వహించింది.

సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు ఆదేశించిన విధానాలను అదుపులేకుండా అమలుచేసిన కాలమిది. ప్రజలను సంప్రదించే ప్రజాస్వామ్య ప్రక్రియగా పేర్కొనబడే విధానం ద్వారా ప్రజలను మోసగించిన కాలమిది. ప్రపంచ అగ్రశక్తి పేరున అమెరికా సామ్రాజ్యవాదానికి సైనికంగానూ, రాజకీయంగానూ తలొగ్గిన కాలమిది. బహుళజాతి పరిశ్రమలు జాతీయ సంపదను లూటీచేయడాన్నీ, భారత బడాబూర్జువావర్గం నిరంకుశాధికార పెట్టుబడిని పోగేసుకోవటాన్ని తీవ్రంచేసిన కాలమిది. శ్రామికప్రజానీకపు జీవన, పనిపరిస్థితులు మరింత దుర్భరంగా దిగజారిన కాలమిది. ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కులన్నీ క్రమంగా రద్దుచేయబడుతున్న కాలమిది. పాలకవర్గాల దోపిడీ అణచివేతలు ప్రజల ప్రతిఘటనలు తీవ్రమవటాన్ని ఈ కాలంలో మనం చూడగలం.

మన మౌలిక డాక్యుమెంట్ల వెలుగులో సంక్లిష్ట అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులను విశ్లేషించుకునేందుకు అందునుండి చేపట్టవలసిన కర్తవ్యాలను రూపొందించుకునేందుకు అఖిలభారత మహాసభ నిర్వహించబడింది.

ఎర్రజెండా ఆవిష్కరణ అనంతరం, అఖిలభారత మహాసభ వేదిక ఏర్పాటును ప్రధాన కార్యదర్శి ప్రకటించారు. ఐదుగురు సభ్యులతోకూడిన అధ్యక్షవర్గాన్ని, ఆరుగురు సభ్యులతోకూడిన సారధ్య సంఘాన్ని మహాసభ ఎన్నుకుంది.

'అంతర్జాతీయ, జాతీయ పరిస్థితి – మన కర్తవ్యాలు' డాక్యుమెంటుపై చర్చల క్రమంలో, దానిని పరిపుష్టం చేసేందుకు ప్రతినిధులు అనేక సూచనలు చేశారు. అంతర్జాతీయ పరిస్థితిని విస్తృతంగా వివరించిన పిదప, సామ్రాజ్యవాదానికి మరియు ప్రపంచ పీడితజాతుల ప్రజానీకానికి నడుమ వైరుధ్యం పెరుగుతూండటమేగాక, ప్రధాన వైరుధ్యంగా కొనసాగుతోందని డాక్యుమెంటు స్పష్టంగా పేర్కొంది. ఈ వైరుధ్యపు ఉనికి, పెరుగుదల సామ్రాజ్యవాద శక్తుల మధ్య వైరుధ్యంతోపాటు ఇతర వైరుధ్యాల ఉనికి పెరుగుదలను ప్రభావితం చేస్తుంది కావున ఇది ప్రధాన వైరుధ్యంగా వుందని స్పష్టం చేసింది.

జాతీయ పరిస్థితిలోని వివిధ అంశాలను వివరించిన తర్వాత, ఈనాడు 'దున్నేవానికే భూమి' నినాదం మరింత ప్రాధాన్యతను సంతరించుకుందని, సామ్రాజ్యవాదానికి, బడాబూర్జువా వర్గానికి వ్యతిరేకంగా సాగించే పోరాటంతోపాటుగా భూమికోసం పోరాటం సాగించాలని డాక్యుమెంటు స్పష్టంగా పేర్కొంది. ప్రజల ఆకాంక్షలను, కోర్కెలను, ఆందోళనలను, పోరాటాలను అణచివేసేందుకు పాలకవర్గ పార్టీలు అర్ధఫాసిస్టు లేదా ఫాసిస్టుతరహా విధానాలను చేపడుతున్నాయని డాక్యుమెంటు పేర్కొంది. ఈరకపు అర్ధ-ఫాసిస్టు అణచివేత, ద్రవ్యపెట్టుబడి ఆధిపత్యం పెరుగుదలకు ప్రధాన ఆధారంగా వుంది.

ప్రజలు ఒక ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. కానీ అతి, మితవాదాలు, సంస్కరణవాదం, అతివాద వామపక్ష ఒంటెత్తువాదం, సాహసవాదాల కారణంగా కమ్యూనిస్టు విప్లవకారులు వారికి నాయకత్వం అందించేందుకు తగిన స్థితిలో లేరు. ఈ నష్టకరమైన రెండు తీవ్ర ధోరణుల మధ్య భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఊగిసలాడుతూండటం, పార్టీని, ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు దోవ తీసింది. మన సమాజం అర్ధఫ్యూడల్, అర్ధవలస స్థితిలో వుండగా, పెటీబూర్జువా వర్గం యొక్క ప్రభావం దీనికి కారణంగా వుంది. కనుక, ఒకే ఒక్క ఐక్య బోల్షివిక్ పార్టీని నిర్మించటమే అత్యవసర కర్తవ్యం. అన్ని తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక, రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తూనే కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతా క్రమానికి అంటిపెట్టుకొని వుండటాన్ని కొనసాగించాలి.

ఇతర రాజకీయ పార్టీలు, సంస్థలతో ప్రజాసమస్యలపై ఇప్పటికే కేంద్రకమిటి అనుసరిస్తున్న ఐక్యకార్యాచరణ విధానాన్ని అఖిలభారత మహాసభ స్వీకరించింది. ప్రతినిధులు చేసిన అనేక సూచనలు, సవరణలతో సహా డాక్యుమెంటును ఆమోదిస్తూ అఖిలభారత మహాసభ ఓ తీర్మానాన్ని ఆమోదించింది.

కేంద్రకమిటి తరపున, ప్రధాన కార్యదర్శి కేంద్రకమిటి యొక్క 'రాజకీయ, నిర్మాణసమీక్ష'ను ప్రతిపాదించారు. ఈ రాజకీయ, నిర్మాణసమీక్ష – మన ఐక్యతా ప్రయత్నాల వివరాలను పేర్కొనటంతోపాటు, కేంద్రకమిటి ఆమోదించిన ఐక్యతా విధానాన్ని లోతుగా చర్చించవలసిందిగా ప్రతినిధులను కోరింది. కేంద్రకమిటి మరియు కేంద్రకమిటి సభ్యుల ఫంక్షనింగ్‌లలోని బలహీనతలను సమీక్ష ఎత్తిచూపింది. కేంద్రకమిటి ఫంక్షనింగ్‌ను సమిష్టిగా మెరుగుచేసుకునేందుకు ప్రతినిధి కామ్రేడ్స్ పలు సూచనలు చేశారు. ప్రస్తుతమున్న నిర్దిష్ట పరిస్థితులలో ప్రతికూల అనుభవాలున్నప్పటికీ కేంద్రకమిటి ఆమోదించి, అనుసరిస్తూ వస్తోన్న 'విబేధాలతో కూడిన ఐక్యతా విధానం' సరైందేనని వారు పేర్కొన్నారు. సంఘర్షణతో ఐక్యతను సాధించటం ద్వారా అన్ని స్థాయిల్లోనూ పార్టీని, పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసుకోవాలని తద్వారా మాత్రమే మన పార్టీ తనముందున్న కర్తవ్యాలను నెరవేర్చగల్గుతుందని వారు గట్టిగా అభిప్రాయపడ్డారు. సిసి ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ సమీక్షను ఆమోదిస్తూ అఖిలభారత మహాసభ తీర్మానించింది.

పార్టీ మౌలిక డాక్యుమెంట్లపై ఆధారపడి 2013లో సిపిఐ(ఎం-ఎల్) మరియు సిపిఐ(ఎం-ఎల్) సెంట్రల్ ఆర్గాన్ – జనశక్తి ఒకే సంస్థగా విలీనమవ్వాలని నిర్ణయించాయి. రెండు సంస్థలు రూపొందించుకున్న 26-1-2013 నాటి ఐక్యతా ప్రకటనను స్వీకారం కొరకు అఖిలభారత మహాసభ ముందుంచారు. ఈ ఐక్యతా ప్రకటనను మహాసభ ఆమోదించింది. దీని కొనసాగింపుగా, భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమం; భారత విప్లవ పంథా మరియు పార్టీ ప్రణాళికలను ఐక్యతా చర్చల సందర్భంగా వాటి మెరుగుకోసం చేసిన కొన్ని సూచనలతోసహా స్వీకారం కొరకు మహాసభ ముందుంచారు. మన పార్టీ మౌలిక డాక్యుమెంట్లుగా వీనిని అఖిలభారత మహాసభ స్వీకరించింది.

అఖిలభారత మహాసభ నూతన కేంద్రకమిటీని ఎన్నుకొంది. కేంద్రకమిటి కొద్దిసేపు సమావేశమై కామ్రేడ్ విశ్వంను ప్రధానకార్యదర్శిగా ఎన్నుకొంది.

పాలకవర్గాలు చేపట్టి, అనుసరిస్తున్న విధానాలపైన, ప్రస్తుతం దేశంలో నెలకొన్న తీవ్ర సమస్యలపైనా అఖిల భారత మహాసభ అనేక తీర్మానాలను ఆమోదించింది. **(ఈ సంచికలోనే తీర్మానాల పాఠాన్ని చూడగలరు)**

మహాసభ ముగింపులో ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధాన వెలుగులో తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించాలని, కేంద్రీకృత ప్రజాస్వామ్యం, విమర్శ – ఆత్మవిమర్శ, ఆంతరంగిక చర్చ మరియు సంఘర్షణ, క్రమశిక్షణలపై లెనినిస్టు అవగాహనను మనం ఖచ్చితంగా అమలుచేయాలని కామ్రేడ్స్‌కు పిలుపునిచ్చారు.

గత కమ్యూనిస్టు ఉద్యమం మనకందించిన విలువైన సాంప్రదాయాలను, పద్ధతులను సొంతం చేసుకొని, ముందుకు కొనిపోవాలని ఆయన కామ్రేడ్స్‌కు పిలుపు నిచ్చారు. అలాగే మౌలిక అవగాహనలను, విధానాలను, నిర్ణయాలను మరియు మహాసభ సందేశాన్ని పార్టీ శ్రేణులందరి వద్దకు తీసుకువెళ్ళి, ద్విగుణీకృత అంకిత భావంతో, స్పష్టతతో, నిబద్ధతతో ఆచరణలోకి వెళ్ళవలసిందిగా ఆయన ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

ఉత్తేజకరంగా 'అంతర్జాతీయ శ్రామిక గీతం' ఆలాపనతో సిపిఐ(ఎం-ఎల్) అఖిలభారత మహాసభ ముగిసింది.

ooooo